# తీపి బతుకు

నీళ్ళను కోసుకుంటూ పడవ కదిలింది. నీళ్ళు చురుగ్గా తప్పుకుని అలలు అలలుగా పక్కలకు జారిపోతున్నాయి. రేవుకు దూరంగా. గట్టుదిగి నీళ్ళ ల్లోంచి కత్తుల్లా పొడుచుకొచ్చిన రెల్లుగడ్డి తలలమీద రెక్కలు విప్పుకుని మీనియేచర్ గాలి ఓడల్లా ఎగురుతున్నాయి తూనీగలు. గట్టుమీదనుంచి నీళ్ళ అంచుల్ని తాకుతూ వంపు తిరిగిన తుమ్మచెట్టు కొమ్మలనిండా గిజిగాడు గూళ్ళు రబ్బరు బుడగల్లా వేలాడుతున్నాయి. పెద్దింటి లోగిళ్ళలో వేలాడ దీసిన యిలాయి బుడ్లులా వున్నాయవి. రక్తకుల్యే ఉప్పుటేరు లేత ఎండలో మెరుపులు మెరుస్తోంది.

ఈ సౌందర్యమంతా తనదే అని మురిసిపోయే సావిత్రి యిప్పుడు వాటిని గురించి పట్టించుకోవడమేలేదు. గట్టు అవతల కొబ్బరితోట విరబోసు కున్న జుత్తులోంచి బిక్కుబిక్కుమని కనిపిస్తోన్న ఊరుని దిగులుగా చూస్తోంది. ఊళ్ళోకిపోయే ఇసుక పుంత, విశ్వాస్త నేలమీద ఆరేసిన తడి చీరలా కనిపిస్తోంది. పుంత వారనే బ్రహ్మజెముళ్ళు దారి మూసేసి బాయ్ నెట్లతో కాపలాకాసే సెంట్రీల్లా ఉన్నాయి. తను వొస్తే అడుగెట్టనీయకుండా కొరడాలతో ఝుళిపిస్తున్నట్టున్నాయి కొబ్బరిచెట్లు. అటూ యిటూ కత్తుఃబోను పెట్టినట్టు భయపెడ్తున్నాయి రెల్లు దుబ్బులు.

ఇంతకుముందు చెట్లమధ్య ఊరును చూసినప్పుడు కొత్త పెళ్ళికూతురు గుర్తొచ్చేది. ఆ యిసుకపుంత పచ్చని పట్టుపరికిణీ అడుగున మెరిసే జరీ అంచులా అనిపించేది. బ్రహ్మజెముళ్ళు ఉరుము ఉరిమిన మర్నాటి తొలిఝాము వేళ మొగ్గలు పేలి పేలాలై కలువపూలంత పూలు విచ్చుకుని ఆ వూరికి కొలనులేని కొరతను తీరుస్తున్నట్టనిపించేవి. కొబ్బరి చెట్లను చూసినప్పుడు

పెళ్ళి పందిళ్ళు గుర్తొచ్చేవి. రెల్లు దుబ్బుల్ని చూస్తే అస్తమానం ఆడుతూ పాడుతూ వుండే పదేళ్ళ పరికిణీ పాపలు కళ్ళల్లో కదిలేవారు.

కాని ఇప్పుడు మనసు మనసులో లేదు. దిగులుగా వుంది. బితుకు బితుకుగా వుంది. ముసురు పట్టినట్టు చిత్తడి చిత్తడిగా వుంది.

పడవ గట్టుచేరింది.

"ఏమిటోయ్ దీర్ఘాలోచనలో పడ్డట్టున్నావ్! గట్టు వచ్చేసిందోయ్, దిగు" అన్నాడు గోవిందరావు.

భర్త మాటలకి ఆలోచన్లని దులుపుకుంటూ పడవ దిగింది సావిత్రి. పడవవాడు అందిచ్చిన సామాను భర్త అందుకోబోతే "ఉండండి నేను తెస్తాను, మీరు అలాటి బరువులు మొయ్యగూడదు" అని తనే అందుకుంది.

"భలేదానివే, మరీ రోగిష్టాడికింద జమకట్టేస్తున్నావేమిటి. డాక్టరు ఆ మాట అన్నాడని చెప్పి ఇంతలా సుకుమారం చేసేస్తున్నావ్ నన్ను" అన్నాడు గోవిందరావు.

సావిత్రి జవాబు చెప్పకుండా సామాను తీసుకువెళ్ళి గట్టుమీద వుంచింది. "ఇలా రండి, జట్కాబండి వచ్చేవరకూ యిదిగో యీ పెట్టెమీద కూచోండి. మీరు కూచోకపోతే నామీద ఒట్టే" అంది.

గోవిందరావు చిర్నవ్వుతో "మరీ అలా భయపడిపోతా వేమిటోయ్. నువ్వు గాభరాపడ్డం కాదుగానీ నన్నుకూడా గాభరా పెట్టేస్తున్నావ్. నీ కంగారూ అదీ చూస్తోంటే ఎంత కాదనుకున్నా గుండె బితుకు బితుకు మంటోంది' అన్నాడు. వచ్చి కూచున్నాడు.

గోపిందరావు అంతకు ముందురోజే జట్కాబండి తాతబ్బాయికి కబురంపించాడు—ఉదయం ఎనిమిది గంటలప్పుడు బండి కట్టుకుని రేవుకాడ వుండమని. బండి ఇంకా రాలేదు.

బస్సు రూటుకి వెళ్ళాలంటే రెండుమైళ్ళు పుంతదారంట పోవాలి. ఊళ్ళోవాళ్ళు సాధారణంగా నడిచే పోతుంటారు. సామాను వుంటే ఎవరి నెత్తికైనా ఎక్కించి మోయించుకుని వెళ్తుంటారు. మరీ అవసరమైనప్పుడు ముందుగా బండి ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. ఊళ్ళోంచి నేరుగా బండి

కట్టించుకోడానికి వీల్లేదు. ఊరికి అవతలవైపు సముద్రమూ, ఇవతలవైపు రక్తకుల్య ఉప్పుటేరూ ఉన్నాయి. ఉప్పుటేరుమీద బళ్ళవంతెన కాదుగదా కాలి వంతెనైనా లేదు. ఒక బళ్ళవంతెన కట్టే ప్రపోజలు చాలా కాలంనించి కాగితాల మీద పడి మూలుగుతోంది. అది కట్టేవరకు ఆ వూరివాళ్ళు యివతలి వూరు రావాలన్నా, ఇవతలివారు ఆ వూరు వెళ్ళాలన్నా పడవ తప్ప మరో దారిలేదు. ముందుగా చెప్పితే బట్టీలంక నుంచి జట్కాబండో, ఒంటెద్దుబండో రేవుకాడ కొస్తుంది.

గోవిందరావు అంతకు ముందురోజే స్కూల్లో కుర్రాడిచేత తాతబ్బాయికి కబురంపించాడు.

"ఈ మాత్రం దానికి బండెందుకు, నడిచే వెళ్ళిపోదాం, ఏ కుర్రాడినో సామాను మోసెయ్యరా అంటే మోసేస్తాడు కదా" అని గోవిందరావు మొదట్లో అంటే సావిత్రి వొప్పుకోలేదు.

"రెండు మైళ్ళు మీరు నడవడమే వొద్దండీ....బండి ఏర్పాటు చెయ్యండీ" అంది.

గోవిందరావు మళ్ళీ అదే సంగతి ఎత్తాడు.

"చెప్తే వినిపించుకున్నావు కాదు. హాయిగా నడుచుకుంటూ వెళితే ఎంత బావుండేది!" అన్నాడు.

"కబుర్లు చెప్పుకుంటూ నడవడం నాకూ సర్దాయే. ఇంతకు ముందు ఎన్నిసార్లు వెళ్ళలేదు మనం. కాని యిప్పటి పరిస్థితుల్లో మీరు రెండు మైళ్ళు నడవడమే....అమ్మో" అంది.

"ఎందుకంత భయం. చచ్చిపోతాననే" అన్నాడు గోవిందరావు చిన్నగా నవ్వుతూ.

"ఛీ....అవేం మాటలండీ. ఏ మాట అనాలో ఏ మాట అనకూడదో తెలీదుకదా. ఈసారి మళ్ళీ అలా అన్నారంటే నన్ను చంపుకుతిన్నంత వొట్టు" అందీ. ఆమె కంఠం బొంగురు పోయింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినట్టున్నాయి. ముఖం అటుపక్కకు తిప్పేసింది.

జట్కాబండి వచ్చింది.

"ఆలస్యమైపోయింది మేష్టరుగారూ, పొద్దున్నే రాజోలు బేరం తగిలిం దండి. ఎల్లొచ్చేతలికి యీ ఏలైపోయింది బాబూ" అన్నాడు తాతబ్బాయి. గబగబా సామాను బండిలో ఎక్కించేశాడు. ఇద్దరూ లోపలికి ఎక్కి కూచున్నారు.

ఇసుకపుంత. వర్షాకాలంలో అయితే ఇసుక తడిసి బిగుసుకుపోయి ఉంటుంది గనుక బళ్ళగాడిలోంచి నడిస్తే ఏదో విధంగా కదులుతుంది బండి. మిగతా కాలాల్లో మాటిమాటికీ అదిలిస్తేగాని బండి కదలదు. కదిలినా ఒంటెద్దు బండిలాగ కదలీ కదలనట్టు నడుస్తుంది.

బండివాడు కిందేవుండి నడిపించుకు వెళ్తున్నాడు. గోవిందరావు ముందువైపు కూచున్నాడు. సావిత్రి వెనక్కి జారబడి కూచుంది

అవతలి గట్టుమీద వూరు మెలమెల్లగా దూరమైపోతోంది. గాలిపటాన్ని ఎగరవేసినప్పుడు చేతిలోంచి దారం విప్పుకుని జారుతున్నట్టుగా ముందుకి వెళ్ళిపోతోంది వూరు. ఈ దూరం మళ్ళీ దగ్గర అవుతుందో లేదో? ఆ ఎగిరే గాలిపటం తెగిపోకుండా వున్నంత వరకు ఫరవాలేదు. ఒకవేళ....

సావిత్రి గుండె దడదడలాడింది. భయంతో దగ్గరగా ముడుచుకు పోయింది. మోకాళ్ళచుట్టూ చేతులు చాచుకుని మొగ్గలా ఒదిగిపోయి కూచుంది.

"కాత్త పైకి రాండమ్మగోరూ" అన్నాడు బండివాడు.

సావిత్రి పైకి జరిగింది. భర్త కుడిచేతి వేళ్ళు ఆమెకు తగులుతున్నాయి. గిలిగింతలు పెడుతున్నాయవి. అంత భయంలోనూ మనసు తేలికపడింది.

సావిత్రి కళ్ళముందు మూడేళ్ళ కిందట మొదటిసారిగా యీ వూరు వస్తున్నప్పటి దృశ్యం కదిలింది.

పెళ్ళయ్యాక అదే తొలిసారి రావడం. నిడదవోలులో బ్రాంచిరైలు బాగా లేటు కావడంవల్ల నర్సాపురం చేరేసరికే ఆలస్యమైపోయింది. రిక్షాలో రేవుకాడికొచ్చి, పడవమీద గోదావరి దాటేసరికి సాయంకాలమైంది. బస్సు దొరికి, ఆ సఖినేటిపల్లి రేవునించి బట్టీలంక చేరేసరికి బాగా చీకటి పడి పోయింది. అంత చీకట్లోను పుంతలవెంట ఒంటెద్దు బండిమీద రెండుమైళ్ళు వెళ్ళి రక్తకుల్య వొడ్డుదాకావచ్చి, మళ్ళీ పడవమీద ఉప్పుటేరు దాటి ఇంటిని

చేరేసరికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. పుంతలోంచి వస్తున్నప్పుడు ఆయన బండివాడితో అంతకు వారం క్రితం జరిగిన హత్య గురించి మాట్లాడుతున్నారు. ఒకాయన సర్వీతోట అమ్మి డబ్బు తీసుకొని ఇంటికి వస్తోంటే చీకట్లో కొంతమంది పొంచివుండి చంపేశారట. ఆ విషయాలు ఆసక్తిగా మాట్లాడుకుంటున్నారు.

"ఏమిటండీ, మాట్లాడుకోవడానికి యింతకన్నా వేరే విషయాలు యేవీ దొరకలేదూ" అంది ఆమె.

గోవిందరావు "భయం వేస్తోందా....భలేదానివే. ఈ మాత్రానికే అంతగా భయపడిపోతారా ఎవరన్నా" అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

చీకటిగావుంది. అటూ ఇటూ చెట్లూ తుప్పలూ. బండివాడు నడుస్తూ బండిని నడిపిస్తున్నాడు. సావిత్రి వెచ్చగా భర్త గుండెల్లో ఒదిగిపోయింది. అతని గుండె చప్పుడు వింటూ చాలాసేపు అలానే వుండిపోయింది.

సావిత్రి కళ్ళముందు ఆ దృశ్యమే కదిలింది. ఆమె పెదాలమీద చిర్నవ్వు జారింది. కాని అంతలోకే ఆ చిర్నవ్వు తెగిపోయింది.

ఆరోజు ఆ గుండె చప్పుడు సరిగమల్లా అనిపించింది. మనసులోని సంగీతం వొలుకుతున్నట్టనిపించింది. ఇప్పుడా సంగీతం వినిపిస్తుందా? ఇప్పుడా గుండెచప్పుడు సరిగమల్లా వుండదుగాబోలు. అర్ధరాత్రి కటిక చీకట్లో నిశ్శబ్ద వాతావరణంలో గడియారం శబ్దంలా భయపెడ్తుంది గాబోలు. ఏకాంతంలో ఇంటిముంగిట బరువుగా బూట్లచప్పుడు వినిపించి అదరగొట్టేట్టు వుంటుందేమో. పాడైపోయిన గుడిలో గబ్బిలాలు అరుస్తున్నట్టు ఒళ్ళు జలదరింపజేసేట్టు వుండొచ్చు. ఆ గుండెలమీద తలవాల్చడానికి భయంగావుందిప్పుడు. తార స్థాయికి వెళ్ళిన ఆర్కెస్ట్రా ఏ క్షణంలోనన్నా ఆగిపోతూందేమోనన్న ఆతృత లాటి ఆతృత ఆమెను తాపీగా ఊపిరి పీల్చుకోనివ్వడంలేదు.

నెలరోజులుగా గుండె బరువుగా వుంటోందనీ, అప్పుడప్పుడు నొప్పి కూడా వస్తోందనీ గోవిందరావు చెప్తే డాక్టరుకి చూపించుకోమని ఒకటే గొడవ పెట్టింది సావిత్రి.

వారం పదిరోజులు అశ్రద్ధచేసి చివరికి ఆమె పోరుపడలేక ఓ రోజు తాలూకా ఆస్పత్రికి వెళ్ళి చూపించుకున్నాడు. డాక్టరు ఆ ప్రశ్నా యీ ప్రశ్నా అడిగి, స్టెతస్కోపుతో గుండె తడిమి చూసి కనుబొమలు ఎగరేశాడు.

"హార్ట్ డిసార్డర్" అన్నాడు.

పావుగంటసేపు కూచోబెట్టి నీతిబోధ చేశాడు. "పెద్దపెద్ద పనులేం చెయ్యకూడదు. బాగా రెస్టు తీసుకోవాలి. రెగ్యులర్‌గా మందులవీ పుచ్చుకుంటూ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. ఎందుకైనా మంచిది ఏ రాజమండ్రికో, ఏ కాకినాడకో వెళ్ళి ఎక్సరే, ఎలక్ట్రో కార్డియోగ్రాఫ్ తీసుకోండి" అన్నాడు.

ఆ వార్త అతను యింటికొచ్చి సావిత్రితో చెప్పితే ఆవిడగుండే ఆగి పోయినట్టు క్షణకాలం కొయ్యబొమ్మలా వుండిపోయింది. అతనికన్నా ఆవిడే ఎక్కువ హైరాన పడిపోయింది. నాలుగు రోజులు చెవిలో యిల్లు కట్టుకుని చెప్పిచెప్పి చివరకు ఒప్పించి వైజాగ్ బయల్దేరదీసింది. "అంత దూరం ఎందుకూ కాకినాడ వెళ్దాం, అక్కడ పెద్ద డాక్టర్లు వున్నారుకదా" అని అన్నా వినిపించుకోలేదు. ఖర్చయితే అయ్యిందనీ, పెద్దాసుపత్రికి వెళితేనే మంచిదనీ వైజాగ్ వెళ్ళడానికే ఒప్పించింది. చేతిలో వందరూపాయలకన్నా ఎక్కువ లేవు. "అవసరమైతే వొంటిమీద నగలున్నాయి కదా అమ్ముకోవచ్చు లెండి", అంది.

గోవిందరావు ఆ వూళ్ళో ఎలిమెంటరీ స్కూలు హెడ్మాస్టరు. పెళ్ళయి మూడేళ్ళయినా పిల్లలు లేరు. ఇద్దరికీ ఆ పల్లెటూళ్ళో అట్టే ఖర్చవ్వదుగానీ అడపా తడపా యిద్దరు అక్కలకీ డబ్బు పంపించాల్సి రావడంతో నాలుగు రాళ్ళన్నా వెనకేసుకోలేకపోయాడు. ఇప్పుడీ అవసరం వచ్చేసరికి చేతిలో వందరూపాయలకన్నా ఎక్కువలేవు. ఏ హైదరాబాదో తీసుకెళ్ళాలని వుంది సావిత్రికి. డబ్బుంటే బయల్దేరదీసేదే. భర్తకి గుండె జబ్బని తెలిసినప్పటినించి ఆమె మనసు మనసులో లేదు. సరిగా అన్నమైనా తినలేకపోతోంది. "ఇంతకీ జబ్బు నీకా నాకా" అంటూ నవ్వుతూ గోవిందరావు అడిగాడు కూడాను.

బండి మెల్లగా నత్తనడక నడుస్తోంది. చక్రాల కింద ఇసుక మూలుగు తున్నట్లు శబ్దం చేస్తోంది. పుంతపక్క అటూయిటూ వున్న కొబ్బరి తోటలు,

సర్వీ తోటలు బరువుగా ఊపిరి పీల్చి వదులుతున్నట్టు ఇస్సుమంటూ నిట్టూర్పులు విడుస్తున్నాయి. బండి చక్రాలకు గీరుకుని తాటికమ్మలు బొంగురు కంఠాలతో గగ్గోలు పెడుతున్నాయి.

సావిత్రి బండి గూడుకు జారబడి బండి కుదుపులకు ఆలోచనల మధ్య ముందుకూ వెనక్కూ ఊగుతోంది. చాలాసేపటి నుంచి ఆమె భర్తవేపే చూస్తోంది. అతను కుడి మోకాలును పైకి తీసుకుని చెయ్యి ఆన్చి నిర్లిప్తంగా పుంత వైపు చూస్తున్నాడు. అతను పట్టిపట్టి దేన్నీ చూడ్డంలేదని యిందాకటి నుంచీ వదులుగా జారిపోతూన్న అతని చూపునిబట్టి అర్థమైంది ఆమెకు. 'పైకి నవ్వుతూవున్నా లోపల్లోపల ఆయన కూడా దిగులు పడిపోతున్నారు. నాలుగు రోజులకే ఎంతెలా అయిపోయారో!'—అనుకుంది సావిత్రి.

రాకరాక ఈ జబ్బేరావాలా! మరో జబ్బు రాకూడదూ. ఏ టైఫాయిడ్డో, ఏ మలేరియానో, చివరికి ఏ క్షయ వచ్చినా ఇంత దిగులు వుండేదికాదు. ఏదో విధంగా మందులవల్లో మాకులవల్లో జబ్బు నయం చేసుకోగలమన్న ఆశన్నా వుంటుంది. గుండె జబ్బుకు మందేమిటి! అది రాకేపోవాలి. వస్తే యిప్పుడు కాకపోతే మరొకప్పుడు....ఎప్పుడో ఏ ఏమరుపాటుగా వున్నప్పుడో అదను చూచుకొని మీద విరుచుకుపడి....

సావిత్రి ఆలోచించడం బలవంతంగా ఆపేసింది. కళ్ళు గట్టిగా మూసుకుంది. వాళ్ళ మావయ్య రూపం కళ్ళవెనకే కదిలింది. ఆ కళ్ళ రెప్పలు ఛప్పున విడిపోయాయి. అయినా ఆ ఆలోచన చెరిగిపోలేదు. గుండె జబ్బుతో నలభై రెండోఏట నవ్వుతూ నవ్వుతూనే మాయమైన మావయ్య జ్ఞాపకం చెరిపేద్దామన్నా చెరిగిపోవడం లేదు. చెరిపేకొద్దీ గుండె కాగితం చిరిగిపోయేట్టుగా వుంది.

మళ్ళీ సావిత్రి బలవంతంగా ఆలోచించడం మొదలుపెట్టింది. పొరిగింటి వివెల్ డబ్ల్యుగారి మూడేళ్ళ పాపని ఆలోచనలలోకి లాక్కొచ్చింది. ఆ పాప ముద్దు ముద్దు మాటలూ, ముచ్చటైన చేతలూ గుర్తు తెచ్చుకొంటోంది. పది నిమిషాలు ఆ పాప ఆలోచనలే ఆమె చుట్టూ గోడ కట్టేశాయి. ఆమె ఎటూ తొంగి చూడలేనంత ఎత్తుగోడలవి. కాని ఆ తర్వాత ఆ గోడలు కూలిపోయి మేనమామ గుర్తుకురాక తప్పలేదు. మేనమామతో పాటు మరో యిద్దరు గుర్తు

కొచ్చారు. ఒకాయన మద్దెల జోగయ్య. మరొకాయన ప్రసిడెంటుగారి పెద్దల్లుడు. జోగయ్య హరికథకి మద్దెల వాయిస్తూనే కళ్ళు మూసేశాడు. ప్రసిడెంటుగారి పెద్దల్లుడు పట్నంలో ఆఫీసుకు వెళ్తూవెళ్తూ దారిలోనే కుప్పకూలిపోయాడు.

సావిత్రికి వళ్ళంతా చెమటపట్టింది. గుండెల్లో సన్నగా వణుకు వచ్చింది. విడుస్తోన్న ఊపిరి వెచ్చబడింది. ఎగశ్వాస దిగశ్వాస కురచనయ్యాయి.

ఆమె తమాయించుకోలేక "ఏమండీ! అలా మౌనంగా వుండిపోయారేం. ఏవైనా కబుర్లు చెప్పండి. ఇంతకీ మా రాజ్యలక్ష్మి వాళ్ళిల్లు దొరక్కపోతే వైజాగ్‌లో ఎక్కడ వుంటాం?" అంటూ కబుర్లలోకి దింపింది. ఆలోచనలకు జడిసి కబుర్లందుకుని ప్రస్తుతంగానో అప్రస్తుతంగానో బండి కంకర రోడ్డెక్కేదాకా మాట్లాడుతూనే వుంది.

బస్సులో రాజమండ్రి వెళుతున్నప్పుడు రద్దీ ఎక్కువగా వుండడంవల్ల ఏ ఆలోచనా ఆమెను అట్టే యిబ్బంది పెట్టలేదు. దానికితోడు బస్సు కుదుపులు ఒకటి! కమ్ముల్ని గట్టిగా పట్టుకుని కూచోడంతోనే సరిపోయింది.

రాజమండ్రిలో వెంటనే రైలు దొరికింది. తాపీగా సర్దుకుని కూచున్నాక టిఫిన్ కారియర్ విప్పి భోజనాలు చేసేశారు.

పెట్టికూడా అట్టే రష్‌గా లేదు.

కిటికీ పక్కన కూచున్నాయన పై బర్త్ మీదకు వెళ్ళిపోయాడు. సావిత్రి అక్కడకు చేరుకుంది. ఈ ప్రయాణం గురించని తెల్లవారు ఝామునే లేవడం వల్ల నిద్ర చాలక మత్తుగావుంటే మూలకు జారబడింది. గోవిందరావు వార పత్రికొకటి కొనుక్కొచ్చి చదువుకుంటున్నాడు.

సావిత్రికి ఎప్పుడు నిద్ర పట్టేసిందో తుళ్ళిపడి కళ్ళు తెరిచేసరికి గోవిందరావు కూడా ఎదురుగుండా వున్న కిటికీ పక్కకే చేరి తననే చూస్తుండడం కనిపించింది.

"ఏమిటలా తుళ్ళిపడ్డావ్, కలేమైనా వచ్చిందా?" అన్నాడు ముందుకు వంగి మెల్లగా ఆమెకు వినిపించేట్టు.

ఏమీ లేదన్నట్టు తల తిప్పింది ఆమె.

"ఏ పీడకలో వచ్చుంటుంది కాబోలు. లేకపోతే ఎందుకలా అదిరి పడ్తావ్‌లే" అన్నాడు మళ్ళీ.

ఆమె మాట్లాడలేదు. గుండె ఎగిరెగిరి పడుతుంటే ఊపిరితోనే బలవంతంగా అణచుకోడానికి ప్రయత్నిస్తోంది.

"అబ్బ! ఏం పిరికి మనిషిరా బాబూ" అన్నట్టు గోవిందరావు ఓ చూపూ, ఓ చిరునవ్వూ విసిరేసి పుస్తకం చదవడంలో మునిగిపోయాడు.

'నాబాధ మీకు అర్థం కాదులెండి' అనుకుంది సావిత్రి మనసులోనే.

మూడేళ్ళ కిందట తన బతుక్కి ఏ ఆశా లేనప్పుడు అదృష్టం తనంతట తను వెతుక్కుంటూ వచ్చిన రోజు యింకా గుర్తుంది ఆమెకు.

తండ్రి ఉద్యోగం సద్యోగం లేకుండా కూర్చుని తిని దర్జా వెలగబెట్టే రకం. అన్నదమ్ములతో పోట్లాడి ఆస్తి పంచుకుని దూరంగా వెళ్ళిపోయి, అయిదేళ్ళకు ఆస్తిని హారతి కర్పూరంచేసి, మరో దారిలేక ఆఖరి రోజుల్లో మళ్ళీ ఆ అన్నదమ్ముల పంచకేచేరి అక్కడే కన్నుమూశాడు. అప్పటికి సావిత్రికి అప్పుడప్పుడే ఊహ తెలిసివస్తోన్న వయసు. తమ్ముడు అడ్డాల్లోవాడు. వాళ్ళని చూసి జాలిపడో, పెద్దవాళ్ళు చెప్పితే ఆలకించో ఓ రెండు గదుల చిన్న పెంకుటిల్లు వాళ్ళమ్మ పేరున రాసిచ్చారు చిన్నాన్నలు. ఆ యింట్లోనేవుంటూ, కుట్టుమిషను ఒకటి పెట్టుకుని ఎలాగోలా పెంచుకొచ్చింది తల్లి. కూతురుకి వయసు వచ్చేసరికి పెళ్ళి ఓ సమస్య అయ్యింది. మరిదిగార్లు యీ చెవిన విని ఆ చెవిన వదిలేసేవారు. కూతురి పెళ్ళి ఎప్పటికైనా వాళ్ళే చెయ్యాలిగాని తనకు చేతకాదని ఆవిడకి తెలుసు. ఒకటికి పదిసార్లు చెప్పడంకన్నా మరేమీ చెయ్యలేకపోతోంది. సరిగ్గా అలాటి పరిస్థితుల్లో వచ్చాడు గోవిందరావు .... దగ్గర బంధువు ఒకాయనపోతే ఆ వూరు వచ్చి, చిన్నప్పుడు వాళ్ళింటి పక్కనేవున్న సావిత్రి వాళ్ళని చూసిపోదామని యిల్లు వాకబుచేసి వచ్చాడు. ఎదిగి పెళ్ళీడుకొచ్చినా ఎవరికీ పట్టని కూతురు గురించి ఆయనతో చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకుంది సావిత్రి తల్లి. వాళ్ళ స్థితికి జాలిపడి పదిరూపాయలు కుర్రాడి చేతిలో పెట్టి వెళ్ళిపోయిన గోవిందరావు అకస్మాత్తుగా ఓరోజు వుత్తరం రాశాడు సావిత్రిని పెళ్ళి చేసుకుంటానని.

చిన్నప్పుడు వాళ్ళింటి పక్కన వున్నప్పుడు తరచు తమ ఇంటికి ఆడుకోడానికి వచ్చేవాడనీ, మా అమ్మాయిని పెళ్ళాడ్తావటోయ్ అని సావిత్రి తండ్రి అడిగితే ఊ అని తలాడించి సిగ్గొచ్చి పారిపోయేవాడనీ సావిత్రి తల్లి ఆ తర్వాత సావిత్రికి చాలాసార్లు చెప్పింది.

సావిత్రికి ఆ సంగతి గుర్తులేదు. అప్పటికి ఆమెకు ఊహ సరిగా తెలీదు. ఆయన ఆనాటి బాల్యాన్ని మర్చిపోకుండా తనంటతాను పెళ్ళి చేసుకుంటానని వస్తే తన జీవితానికి ఒక గొప్ప వరం లభించినట్టు అనిపించింది సావిత్రికి. కలలోతప్ప తెలివిలో వున్నప్పుడు ఏనాడూ వూహించనన్నా వూహించని అదృష్టం తనను వరించిందనుకుంది. తనకన్నా అదృష్టవంతులు మరెవరూ వుండబోరనుకుంది.

ఇప్పుడా విషయాలన్నీ ఆలోచిస్తోంటే సావిత్రికి ఎందుకో భయంగా వుంది. తనెంతో మురిసిపోయిన యీ అదృష్టం యింత తొందరగా ఊగిసలాడిపోతుందని అనుకోలేదు. తన జీవితం పదికాలాలపాటు పచ్చగా వుంటుందనుకుంది. మొలకెత్తినట్టే ఎత్తి వాడిపోతుందనుకోలేదు. ఒకవేళ నిజంగానే వాడిపోవడమేగాని జరిగితే....

సావిత్రి భయంతో గజగజ లాడిపోయింది.

దాహంతో నోరు పిడచగట్టుకుపోతే మరచెంబు తీసి రెండు గ్లాసుల నీళ్ళు గడగడా తాగేసింది. గోవిందరావు పుస్తకాన్ని పక్కన పడేసి తనకో గ్లాసుడు యిమ్మంటే యిచ్చింది. కాళీగావుంటే యీ ఆలోచన్లు తనని తిన్నగా కూచోనివ్వటం లేదని ఆతని పక్కనేవున్న వారపత్రిక తీసి చూస్తూ కూచుంది. వైజాగ్ వెళ్ళేవరకు ఆవిడ ఆ పత్రికను మరిక వదల్లేదు.

వైజాగ్‌లో ఆమె పింతల్లి కూతురు వుంది. ఏడాది అయ్యింది పెళ్ళయి. బయలుదేరుతున్నప్పుడు ఆవిడ అడ్రసు పట్టుకొంది సావిత్రి. ఆ అడ్రసు ప్రకారం వెతుక్కుంటూ వాళ్ళింటికి చేరుకున్నారు. తీరా వెళ్ళింతర్వాత చూస్తే తెలిసింది యిల్లు చాలా చిన్నదని. రెండే రెండుగదులు. వాళ్ళకే బొటాబొటీగా సరిపోతోంది. పోనీ ఏ హోటల్లోకో వెళ్ళిపోదాం అనుకుంటే ఆవిడ వెళ్ళనిచ్చిందికాదు. ముగ్గురు పింతల్లుల పిల్లలందరిలోకి ఈ అమ్మాయి రాజ్యలక్ష్మి

ఒక్కర్తికే సావిత్రి అంటే అభిమానం. ఫరవాలేదు ఎలాగోలా సర్దుకుందాంలేవే అంది. బావకి గుండె జబ్బని తెలిసి ఆ అమ్మాయి చాలా బాధపడింది.

పర్నాటినించి ప్రయత్నిస్తే మూడో రోజునగాని డాక్టర్ని కలుసుకోడం పడలేదు. అదీ రాజ్యలక్ష్మి భర్త సలహాతో ముందుగా డాక్టరు యింటికి ప్రైవేటు పేషంటుగా వెళ్ళి. కన్సల్టింగు ఫీజు యిచ్చుకుని మాట్లాడితే, ఆయన చెప్పినట్టు మరుసటిరోజు హాస్పిటల్లో ఎక్సరే, ఎలక్ట్రో కార్డియో గ్రాఫ్‌లు తీయించుకోడానికి వీలయ్యింది. ఆ తర్వాత డాక్టరు రమ్మన్న తేదీన మళ్ళీ వెళ్ళాడు. ఇ సి.జి., ఎక్సరే రిపోర్టులు కూడా వచ్చేశాయి.

అతన్ని చూడ్డంతోనే డాక్టరు "గుండె జబ్బని ఎవరండీ మిమ్మల్ని భయపెట్టింది? మతివుందా లేదా ఆయనకు. ప్రాక్టేసు చేస్తున్నాడా, ఈగల్ని తోలుకుంటున్నాడా....తాగొచ్చి టెస్ట్ చేశాడేమిటి. భలేవాడే హడలగొట్టేశాడు కదండీ మిమ్మల్ని. ఇవిగో రిపోర్టులు వచ్చాయి. ఇవి తీసుకెళ్ళి ఆయన మొహానేసికొట్టి అప్పుడు చెప్పమనండి....మీ గుండెకేం బ్రహ్మాండంగా వుంది. జబ్బేంలేదు. అప్పుడప్పుడూ గుండె నొప్పిగా అనిపించడానికి కారణం హైపర్‌ఏసిడిటీ తప్ప మరేంకాదు. కడుపులో ఏసిడ్ కావలసిన దానికన్నా ఎక్కువ తయారవుతోంది. దానివల్ల గేస్ ఏర్పడి అప్పుడప్పుడు గుండె బీట్స్‌లో మార్పు వస్తుంటుంది. అంతేగాని మరింకేంలేదు. మీరు నిశ్చింతగా యీరోజే మీ వూరు వెళ్ళిపోండి. హైపర్‌ఏసిడిటీ పెద్ద జబ్బేంకాదు. ఈ రోజుల్లో యిది చాలా సాధారణమైపోయింది. పులుపు, కారం ఎక్కువ పడకుండా డైట్ కంట్రోలు చేసుకోండి, చాలు. కాఫీ మంచిదికాదు. మందు వాడాలనుకుంటే జెలూసిల్ అని టేబ్‌లెట్స్ రాసిస్తున్నాను. భోజనం చేసింతర్వాత వేసుకుంటుండండి" అన్నాడు.

ఆ రోజున అతనివెంట సావిత్రి కూడావెళ్ళింది. ఆమె బైటే కూచుంది. డాక్టరు మాటలన్నీ ఆమెకు వినిపించాయి.

గోవిందరావు బైటకి వచ్చాడు. డాక్టరేమన్నదీ చెప్పబోతుంటే "అక్కర్లేదులెండి, నాకు అంతా వినిపించింది" అంది. సంతోషంతో తుళ్ళి

పోతున్నట్టు ఆమె అతని చెయ్యిపట్టుకుని గబగబా మెట్లుదిగింది. గాలిలో చేతులు వూపుకుంటూ జాలీగా నడుచుకుంటూ గేటువరకూ వచ్చి ఆగింది.

"సర్దాగా నడుచుకుంటూ యింటికెళ్దామా" అన్నాడు గోవిందరావు.

ఆమె అతని మాటల్ని వినిపించుకోకుండా "టాక్సీ" అంటూ పిలిచింది అక్కడ పార్కుచేసివున్న టాక్సీని.

"టాక్సీ ఎందుకోయ్ యీ మాత్రం దూరానికి" అన్నాడు గోవిందరావు.

"మీరేం మాట్లాడకండి, రండి....నేను చెప్పినట్టు చెయ్యండి" అంటూ చెయ్యి పట్టుకుని టాక్సీదగ్గరకు లాక్కెళ్ళి లోపల కూచోబెట్టి తనూ కూచుంది.

"డ్రైవర్! సాయంకాలం చీకటిపడే వరకూ వూరంతా తిప్పి చూపించాలి. ముందు ఏదైనా ఖరీదైన హోటలుకి తీసుకెళ్ళి ఆపు, ఆకలిగా వుంది ఏమైనా తినాలి" అంది.

టాక్సీ డ్రైవరు ఓసారి ఆశ్చర్యంగా వెనక్కు తిరిగి చూసి కారుని పోనిచ్చాడు.

గోవిందరావుకి ఏమీ అర్థంకాక భార్యవైపు వింతగా చూశాడు.

"ఇవాళ మాత్రం మీరేం మాట్లాడ్డానికి వీల్లేదు. నేను చెప్పినట్టు వినాల్సిందే. సాయంకాలం వరకు ఇష్టంవచ్చినట్టు వూరంతా తిరిగేద్దాం. మధ్యలో ఎప్పుడో ఒకప్పుడు యింటికెళ్ళి ఆ సామానంతా పట్టించుకుని ఏ హోటల్లోకో మారిపోదాం మా రాజ్యలక్ష్మి గొడవపెడితే నేనేదో సర్ది చెప్పేస్తా లెండి. అంతగా అవసరమైతే యిదిగో యిప్పుడే వెళ్ళిపోతున్నాం అంటూ అబద్దం ఆడేస్తాను. సాయంకాలం మంచి సినిమా ఏదన్నా చూద్దాం. రాత్రికి హాయిగా కబుర్లు చెప్పుకుంటూ వెచ్చగా పడుకుందాం. మీరు అప్పుడప్పుడు చెప్తుంటారే కోణార్క, భువనేశ్వర్, పూరి అని, అవి చూడ్డానికి రేపో ఎల్లుండో మీరు ఎప్పుడు బైలుదేరదామంటే అప్పుడు బైలుదేరదాం—ఉండండి మీరు మధ్యలో మాట్లాడకండి. నాకు తెలుసు డబ్బులేదని. ఇవిగో నా చేతులకు రెండు జతల గాజులున్నాయి. వూరు చూస్తున్నప్పుడు ఏదో ఒకటైము చూసుకుని ఏ మార్వాడీ షాపుకోవెళ్ళి అమ్మేద్దాం. ఇవ్వాళ నాకు ఎంత సంతోషంగా

వుందో తెలుసా! ఇంత సంతోషం నాకు ఎప్పుడూ కలగలేదు. మన పెళ్ళినాడు కూడా నాకింత ఆనందం కలగలేదు. ఈ ఆనందాన్ని నేను భరించలేక పోతున్నానండీ. దీన్నిలా నాక్కిపట్టితే నా గుండె పగిలిపోతుంది. ఇవ్వాళ నాకెంత సంతోషంగా వుందో మీకెలా చెప్పను....నా మనసే మూగపోయింది ఈరోజు."

సావిత్రి అతని కుడిచేతిని తన చేతుల్లోకి తీసుకుంది. ఆ చేతివేళ్ళను మృదువుగా నిమురుతున్నట్టు రాస్తూ వుండిపోయింది.

టాక్సీ పూలరథంలాగ రోడ్డుమీద కదిలిపోతోంది.

(1972)

★